ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

5

బుధవారం 2 ఏప్రిల్ 2025





అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలో వరి, ఇతర పంటల సమస్యలు, భూసార పరీక్షలు, రాయితీ పరికరాలు, ధాన్యం కొనుగోలు, సాగులో సమస్యలు వంటి వాటిపై ఈనెల 2వ తేదీ బుధవారం ఉదయం 10-11 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. రైతులు **94406 25154** నెంబరుకు ఫోన్ చేసి భీమవరం వ్యవసాయ శాఖ జేడీ వెంకటేశ్వరరావుకు సమస్యలను వివరిస్తే.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

నేడు ప్రపంచ ఆటిజం అవగాహన దినం



ఆటిజం.. శాపమా!

పిల్లల్లో మానసిక ఎదుగుదల ఉండదు

మాటలు రావు.. ఇతరులతో కలవలేరు

ఇటీవల పెరుగుతున్న బాధితులు

7



ఇదేం తీరు!

నీటి తీరువా వసూళ్లు పట్టించుకోని రెవెన్యూ శాఖ

రెవెన్యూ శాఖ అంటే ప్రభుత్వానికి ఆదాయం తెచ్చి పెట్టే శాఖ. ఇప్పుడు కేవలం సేవలకే పరిమితం అవుతోంది. పన్ను వసూళ్లపై దృష్టి పెట్టడం లేదు. సిబ్బంది అందుబాటులో ఉన్నా రెండేళ్లుగా నీటి తీరువా వసూళ్లను నిర్లక్ష్యం చేశారు. భూమి శిస్తు రూపంలో నీటి తీరువా ఏటా సక్రమంగా వసూలు చేయడం ద్వారా రైతులకు సాగునీటి పంపిణీకి వెసులుబాటు ఉండేది. నీటి తీరువా మొత్తాన్ని తిరిగి రైతు ప్రయోజనాలకు ప్రభుత్వం వినియోగిస్తుంది. వేసవిలో కాలువల మరమ్మతు పనులకు నీటి తీరువా మొత్తాలనే ఓ అండ్ ఎం పేరిట నిధులుగా విడుదల చేసి పనులు చేపట్టేవారు. ప్రస్తుతం నీటి తీరువా వసూళ్లు పడకేయడంతో రైతు ప్రయోజనాలకు విఘాతం కలుగుతోంది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

- పడకేసిన రెవెన్యూ వసూళ్లు
- గ్రామానికి ఒక వీఆర్వో
- భూమి శిస్తు వసూలుపై చిత్తశుద్ధి ఏదీ
- పన్ను వసూళ్లతో రైతుకే ప్రయోజనం
- ఓ అండ్ ఎం నిధులుగా నీటి తీరువా సొమ్ము
- వేసవిలో కాలువల ప్రక్షాళనకు అవకాశం

ప్రభుత్వం ఓ అండ్ ఎం నిధుల రూపంలో కాలువల మరమ్మతులకు నీటి తీరువా నిధులను విడుదల చేస్తుంది. గత ఐదేళ్లలో ప్రభుత్వం పైసా విదల్చలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు సాగలేదు. ఆ ప్రభావం గడచిన ఖరీఫ్‌లో చూపింది. భారీ వర్షాలతో పంటలు నీట మునిగి రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఏటా కాలువలు, డ్రెయిన్లు మరమ్మతులు చేస్తే అధిక వర్షాలు కురిసినా సరే ముంపు తీవ్రత ఉండదు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో డ్రెయినేజీ శాఖ, నీటి పారుదల శాఖ పరిధిలోని కాలువలు, డ్రెయిన్లు పూడుకుపోయాయి. ఈ ఏడాది ఖరీఫ్ లో వర్షాలకు పంట పొలాల్లో నీరు స్తంభించిపోయింది. నీటి తీరువా వసూళ్లు సక్రమంగా నిర్వహిస్తే ప్రభుత్వం వద్ద నిధులు అందుబాటులో ఉంటాయి. కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేసే వెసులుబాటు ఉంటుంది.

70 శాతం తిరిగి రైతు ప్రయోజనాలకే

రైతుల నుంచి వసూలు చేసిన నీటి తీరువా మొత్తంలో 70 శాతం తిరిగి కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వం మంజూరు చేస్తారు. పశ్చిమ డెల్టా పరిధిలో పంట పొలాలకు ఏడాదికి ఎకరాకు రూ.350 వసూలు చేయాలి. ఆక్వా చెరువులకు రూ.500 వసూలు చేసే బాధ్యత రెవెన్యూ శాఖ తీసుకుంటుంది. జిల్లాలో 1.33 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. ఆక్వా చెరువుల ద్వారా ఏడాదికి రూ.6.50 కోట్లు పన్ను రూపంలో ఆదాయం వస్తుంది. మరో 2.50 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. కొబ్బరి, పామాయిల్, ఉద్యాన పంటలు కూడా పండిస్తున్నారు. మొత్తంపైన 3.00 లక్షల ఎకరాలకు రూ.350 చొప్పున నీటి తీరువా (భూమి శిస్తు) వసూలు బాధ్యత రెవెన్యూ శాఖపై ఉంది. వరి, ఇతర పంట పొలాల నుంచి ఏటా రూ.10.50 కోట్లు ఆదాయం లభిస్తుంది. గడచిన రెండేళ్లుగా నీటి తీరువా పూర్తిగా విస్మరించారు. కొన్ని మండలాల్లో కనీసం పట్టించుకోకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. ఒకేసారి రైతుల నుంచి వసూలు చేయడం కష్టతరం కానుంది. జిల్లాలో రెండేళ్ల నీటి తీరువా రూ. 32 కోట్ల మేర రావాల్సి ఉంది. గత ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ఎంత వసూలు చేశారనే స్పష్టత లేదు. రెండేళ్ల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేయాలన్న గణాంకాలు బయటకు వస్తున్నాయి. రెవెన్యూ శాఖ దీనిపై దృష్టి సారిస్తే వేసవి పనులకు నిధుల కొరత తీరనుంది.

అవకతవకలతో ఆటంకం

నీటి తీరువా వసూళ్లపై పర్యవేక్షణ కొరవడడంతో క్షేత్ర స్థాయి సిబ్బంది గతంలో అక్రమాలకు పాల్పడ్డారు. రైతుల నుంచి నీటి తీరువా వసూలు చేసి సొంతానికి వాడుకున్నారనే ఆరోపణలున్నాయి. శిస్తు చెల్లించినట్లు రైతులు పాత రశీదులను చూపుతున్నారు. కానీ అవి రెవెన్యూ ఖాతాలో జమ కాలేదు. మరోవైపు రశీదులు భద్రపరచని రైతులను డిఫాల్టర్ జాబితాలో ఉంచారు. శిస్తు వసూళ్లలో ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నీటి తీరువా విధానంపై ప్రభుత్వ స్థాయిలో ప్రక్షాళన చేస్తున్నట్టు సమాచారం. డిజిటలైజేషన్‌తో రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. అప్పటివరకు రెవెన్యూశాఖ వసూళ్లపై దృష్టి పెట్టాలి. సచివాలయాల్లో వీఆర్వోలు ఉన్నారు. శిస్తు వసూళ్లలో వారి సేవలను వినియోగించుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

కాల్వల మరమ్మతులకు రూ. 40 కోట్లు

పశ్చిమ డెల్టాలో కాలువల మరమ్మతులకు ఈ ఏడాది దాదాపు రూ.40 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాలువలు, డ్రెయిన్లలో పూడికతీత, గుర్రపుడెక్క, కర్రనాచు తొలగింపు, షట్టర్లు, లాకుల మరమ్మతులను చేపట్టనున్నారు. ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేసేందుకు సుముఖంగా ఉంది. వేసవి పనులకు ప్రభుత్వంపై భారం లేకుండా ఉండాలంటే రెవెన్యూశాఖ నీటి తీరువా సకాలంలో వసూలు చేయాలి. ప్రస్తుత ప్రభుత్వం జలవనరుల శాఖకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గోదావరి డెల్టా ఆధునీకీకరణకు రూ. 200 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. నీటి సంఘాలను నియమించారు. నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కానీ రైతులు చెల్లించే నీటి తీరువాపై రెవెన్యూ శాఖ శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పెంటపాడు పరీక్షా కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థులు

పది పరీక్షలు ముగిశాయి

- జిల్లాలో ఆఖరి పరీక్షకు 22,596 మంది విద్యార్థులకు 21,795 మంది హాజరు
- తనిఖీ బృందాలు, అధికారుల పర్యవేక్షణ
- ప్రశాంతంగా పరీక్షలు
- రేపటి నుంచి మూల్యాంకనం
- వీరవాసరం జడ్పీ హైస్కూల్లో ఏర్పాట్లు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పది పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలోని 52 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఏవిధమైన మాల్ ప్రాక్టీస్ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు. జిల్లాలో ఆఖరి రోజు సోషల్ పరీక్షకు 22,596 మంది విద్యార్థులకు 21,795 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లాలో ఫ్లైయింగ్ స్క్వాడ్ 38 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పది పరీక్షలను 22,596 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయగా, కరస్పాండెంట్ విధానంలో జిల్లాలో మరో 480 మంది పరీక్షలు రాశారు.

విద్యార్థుల హుషారు

14 రోజుల నుంచి జరుగుతున్న పరీక్షలు ముగియడంతో విద్యార్థులు హుషారుగా పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. ఈ సారి ప్రతీ పరీక్షకు మధ్య ఒకరోజు సెలవుతో విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్ష రాయగలిగారు. తర్వాతి పరీక్షకు సన్నద్ధం కావడానికి వారికి వెసులుబాటు దొరికింది. పరీక్షల్లో ప్రతిభ కనబరిచేందుకు అవకాశం లభించినట్టయింది.

రేపటి నుంచి మూల్యాంకనం

పదో తరగతి పరీక్షలు ముగియడంతో ఈనెల 3 నుంచి మూల్యాంకనం నిర్వహించనున్నారు. వీరవాసరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పది పరీక్షల జవాబు పత్రాలు మూల్యాంకనం చేయడానికి విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. పాఠశాలలోని 25 గదులను ఈ మూల్యాంకనం కోసం కేటాయించారు. 850 మంది ఉపాధ్యాయులు విధులకు హాజరు కానున్నారు. లక్షా 80వేల జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల 9 వరకూ జరగనుందని డీఈవో నారాయణ తెలిపారు.

ఇంటర్ తరగతులకు 19,762 మంది

7 నుంచి మొదటి సంవత్సరం ప్రవేశాలు

24 నుంచి వేసవి సెలవులు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా విధానంలో భాగంగా ఇంటర్ సెకండియర్ క్లాసులు ముందస్తుగా మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 121 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 19,762 మంది విద్యార్థులకు మొదటి రోజు తరగతులు నిర్వహించారు. వారితోపాటు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలు ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్నాయి. అనంతరం వారికి కూడా తరగతులు ప్రారంభిస్తారు. ఏప్రిల్ 23 వరకూ తరగతులు జరుగుతాయి. వేసవి సెలవుల అనంతరం జూన్ 2 నుంచి తిరిగి క్లాసులు ప్రారంభమవుతాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ రెండో సంవత్సర విద్యార్థులందరికీ పుస్తకాలు అందించినట్టు తెలిపారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ సెషన్ -2 బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాలు ఉండగా పశ్చిమలో భీమవరం, నరసాపురంలో ఒక్కొకటి, తాడేపల్లిగూడెం, ఏలూరులో రెండు చొప్పున పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 2 నుంచి 8 వరకూ వివిధ సబ్జెక్టుల ప్రకారం పరీక్షలు జరుగుతాయి. రోజూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ, సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకూ రెండు విడతలుగా పరీక్షలు జరగనున్నాయి.



గోదావరిలో పంటు రూ.40 టిక్కెట్

మాధవాయిపాలెం రేవులో ధరల దరువు

- పాత ధరకు రూ.5 అదనం.. అధికారులకు ఫిర్యాదు
- ఎంపీడీవో తనిఖీ.. టిక్కెట్ల పుస్తకం స్వాధీనం

నరసాపురం రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మాధవాయిపాలెం రేవు దాటే వాహనదారుల నుంచి నిర్వహణదారు అధిక ధర వసూలు చేయడంతో ప్రయాణికులు గగ్గోలు పెట్టారు. అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాత ధరలకే అనుమతించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర శాండ్ క్వారీ బోట్స్‌మేన్ లేబర్ సొసైటీ రూ 4.18కోట్లుకు హెచ్చు మొత్తానికి రేవు నిర్వహణ బాధ్యతలు దక్కించుకుంది. పాటదారుకు రేవు బాధ్యతలు అధికారులు సోమవారం అప్పగించారు. కొద్దిసేపు పాత ధరలు వసూలు చేశారు. తర్వాత ద్విచక్ర వాహనంతో రేవు దాటే ప్రయాణికులకు పాత ధర రూ.35 కాగా తరువాత కొత్త ధర అంటూ రూ.40 టిక్కెట్ ఇచ్చారు. ఒక్కసారిగా రూ.5 పెరగడంతో కొంత మంది ప్రయాణికులు నిలదీశారు. కొంత మంది ప్రయాణికులు నరసాపురం ఆర్డీవో దాసిరాజు, ఎంపీడీవో రామకృష్ణంరాజుకు ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో నేరుగా రేవులో టిక్కెట్ కౌంటర్‌ను పరిశీలించి రూ.40 వసూలు చేయడంపై ఆరా తీశారు. పాత ధరలు వసూలు చేయాలని నిర్వహణదారులకు సూచించారు.

అదనంగా వసూలు చేస్తే నోటీసులు

దీనిపై ఎంపీడీవో రామకృష్ణంరాజు వివరణ ఇస్తూ వాహనదారుల నుంచి రూ.5 అదనంగా వసూలు చేయడం వాస్తమన్నారు. రూ.40 టిక్కెట్ల పుస్తకాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అధికారులకు సమాచారం లేకుండా అధిక ధరలు వసూలు చేస్తే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు. రేవులో ధరల పట్టిక ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు.

95% పింఛన్ల పంపిణీ

- లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వాయిస్ వినిపించారు
- క్షేత్రస్థాయిలో పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి నిమ్మల, ఎమ్మెల్యేలు
- లబ్ధిదారులతో మాట్లాడిన ప్రత్యేకాధికారి సూర్యకుమారి, కలెక్టర్ నాగరాణి

భీమవరంటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 95 శాతం పూర్తయింది. మంగళవారం మధ్యాహ్నం 90శాతం పింఛన్లు పంపిణీ చేశారు. గతంలో సాయంత్రానికి 90 శాతం పూర్తి చేయగలిగేవారు. వేలిముద్రల డివైజ్, సర్వర్ ఇబ్బందులతో పింఛన్ల పంపిణీ త్వరితంగా ముందుకు సాగేది కాదు. ఈ నెలలో పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డివైజ్‌లను సమకూర్చింది. దీనితో వేలి ముద్రలు త్వరితంగా తీసుకోవడంతో జిల్లాలో ఒక్కరోజే 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు, వీరవాసరం మండలం కొణితివాడలో భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయలు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, అర్జునడుపాలెంలో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, పలువురు ఎమ్మెల్యేలు పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 10 సచివాలయాల్లో ప్రయోగత్మకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మీయ పలకరింపు వాయిస్‌తో వినిపించి పింఛన్లు అందించారు. అర్బన్‌లో 5, రూరల్ లో 5 సచివాలయాల్లో అందించారు.

సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం టౌన్ / పాలకోడేరు: ట్రాన్స్‌జెండర్స్ సామాజిక పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి, మహిళా శిశు సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖల ప్రభుత్వ కార్యదర్శి ఎ.సూర్యకుమారి అన్నారు. భీమవరం పట్టణం దుర్గాపురం, పాలకోడేరు మండలం గొల్లలకోడేరులో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సూర్యకుమారి, కలెక్టర్ నాగరాణి స్వయంగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. పింఛన్‌దారులతో మాట్లాడి వారి యోగక్షేమాలను, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మానసిక దివ్యాంగుడు, కిడ్నీ బాధిత మహిళను ఆరోగ్యంపై ఆరా తీశారు. గొల్లలకోడేరులో మహిళలను పింఛన్ల మొత్తాన్ని ఎలా సద్వినిచేసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం పింఛన్లను పెద్ద మొత్తంలో పెంచి అండగా నిలిచిందని లబ్ధిదారులకు ప్రత్యేకాధికారి వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, భీమవరం మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ ఏపీవో మురళీకృష్ణ, సచివాలయ, రెవెన్యూ, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పాలకొల్లు పట్టణంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు



భీమవరంలో పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి, ప్రత్యేకాధికారి సూర్యకుమారి


తీరిక ఏదీ?

పుస్తక పఠనంపై తగ్గుతున్న ఆసక్తి


పిల్లల్ని చదివించే ప్రయత్నం అంతంత మాత్రమే..

బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి సర్వే 6లో


పిల్లలు పుస్తకాలు చదువుతారా




పిల్లలకు పుస్తకాలు కొంటారా



చిన్నతనంలో పుస్తకాలు చదివారా



పుస్తకాలు బహుమతిగా ఇచ్చారా





మొగల్తూరులో డంప్ చేసిన చెత్తను పరిశీలిస్తున్న అధికారులు

క్లీన్ మొగల్తూరు

- చెత్త సమస్యపై డిప్యూటీ సీఎం పేషీ ప్రత్యేక చర్యలు
- విశాఖలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు తరలింపు యోచన

మొగల్తూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చెత్త సమస్య పరిష్కరించి క్లీన్ మొగల్తూరుగా తీర్చిదిద్దడానికి డిప్యూటీ సీఎం పేషీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆక్వా చెరువులు, రహదారి వెంబడి డంప్ చేసిన చెత్తను విశాఖపట్నంలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌కు తరలించనున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేషీ అధికారులు మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పవన్ కల్యాణ్ ఆదేశాలతో గత నెల 28న గ్రామాభివృద్ధి సభ ఏర్పాటు చేశారు. మొగల్తూరులో ప్రధాన సమస్యలను గ్రామస్థులు పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో డంపింగ్ యార్డ్ లేకపోవడంతో నిత్యం సేకరించిన చెత్తాచెదారం ఆక్వా చెరువుల వద్ద, రహదారుల వెంబడి వేస్తున్నారని నల్లంవారితోటకు చెందిన ఆక్వా రైతు కొత్తపల్లి చిరంజీవి అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం పేషీ అధికారులు విశాఖపట్నంలోని వేస్ట్ టూ ఎనర్జి ప్లాంట్‌కు చెత్తా, చెదారం తరలించాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన

తణుకు పట్టణం నుంచి డంప్ చేసిన చెత్తా చెదారం విశాఖకు తరలిస్తున్నారని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిప్యూ సీఎం పేషీ అధికారులు సూచించడంతో మంగళవారం ఈవోఆర్డీ నవీన్ కిరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మోహనరావు, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు డంప్ చేసిన చెత్తను పరిశీలించారు. మొగల్తూరు జాతీయ రహదారికి ఆనుకుని సుమారు 800 క్యూబిక్ మీటర్ల విస్తీర్ణంలో చెత్త నిల్వ ఉందని గుర్తించారు. తణుకు నుంచి 15 టన్నుల చెత్త విశాఖకు తరలిస్తున్నారని, మొగల్తూరులో చెత్త ఎగుమతికి ప్రతిపాదనలు సిద్ధం చేసి డీసీఎం పేషీకి పంపుతామని ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్ తెలిపారు.

హమ్మయ్య... పరీక్షలు అయిపోయాయ్ !











పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు పరీక్ష పూర్తవడంతో విద్యార్థులంతా పరీక్ష కేంద్రాల నుంచి ఉత్సాహంగా బయటకు వచ్చారు.. హాస్టళ్లలో ఉన్న విద్యార్థులైతే పెట్టె సర్దుకుని ఇళ్లకు బయలుదేరారు.. తల్లిదండ్రులు, బంధువులు వారి పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్లారు.. ఏలూరులో వివిధ ప్రాంతాల్లో దృశ్యాలివి.. - ఫొటోగ్రాఫర్, ఏలూరు

తీరిక ఏదీ?

నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

మా తరంలో అర్ధ రూపాయికి అరువుకి అద్దెకు కొనుగోలు చేసి పుస్తకాలు కొన్నాం.. కాలంతో మేము పరుగులు పెట్టలేం. పుస్తకాల కోసం పరుగులు పెట్టలేం. పిల్లల్ని చదవమని చెప్పగలం.. ఈ పుస్తకమే చదవాలన్న వారికి కోరిక, తీరిక, ఏకాగ్రత ఉండడం లేదు. ఇదీ నేడు పుస్తకాలపై ఉన్న ఉన్నశ్రద్ధ అని పలువురు పెదవి విరిచారు. .కేజీ నుంచి పీజీ వరకు పిల్లలు, యువకులు సెల్‌ఫోన్, టీవీ వీక్షణపై, సోషల్ మీడియా, ఛాటింగ్‌లపైనే ధ్యాస పెరుగుతోంది. సైన్సు, సమాజం, ఇతరత్రా మంచి, చెడులపై దృష్టి పెట్టడం లేదు. కనీసం మ్యాగజైన్లు, ఇతర పుస్తకాల్లో వచ్చే నీతి కథలు, బాలభారతం కథలు లాంటివి కూడా కనీసం చూసే తీరిక లేదు. రోజూ స్కూళ్లలో ఇచ్చే హోంవర్కులు, ఇతర ఎసైన్‌మెంట్‌లపై కుస్తీ పడుతున్నారే తప్ప సమాజం, సైన్సు, ఇతర రంగాలపై మక్కువ చూపడం లేదు. నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో 100 మందికి పైగా తల్లిదండ్రులను 'ఆంధ్రజ్యోతి' పుస్తకాలు చదవడం, పిల్లలకు కొనివ్వడం తదితర అంశాలపై అభిప్రాయాలను సేకరించే ప్రయత్నం చేసింది. ఆ సర్వేలో వారు వెలిబుచ్చిన వివరాల ఆధారంగా తేలిన సారాంశం ఇదీ.. - (ఏలూరు/ భీమవరం టౌన్- ఆంధ్రజ్యోతి)



• స్కూల్స్‌లో లైబ్రరీ అవర్ పెట్టాలి



నేను స్టోరీస్, సైకాలజీ, యద్దనపూడి రచనలు ఒకప్పుడు బాగా చదివేదాన్ని. ఇప్పుడు ఒక ఆత్మకథ, అబ్దుల్ కలాం పుస్తకాలు, స్వామి వివేకానంద పుస్తకాలు చదువుతున్నా.. మా వారు తాళపత్ర గ్రంథాలు, ఇతర పుస్తకాలు ఇంట్రస్ట్‌గా చదువుతారు. మా అబ్బాయి ఇషాన్ 8 తరగతి చదువుతున్నాడు. పంచతంత్ర, ధర్మపరిచయం కథలు చదివిస్తాను. బయట నుంచి ఎక్కువగా కొని ఇస్తాను. లైబ్రరీ అవర్ 45 నిమిషాలు ప్రతీ స్కూల్‌లో అమలు చేయాలి. ఒకప్పుడు లైబ్రరీ అవర్ ఇచ్చేవారు. బుల్లెట్ పాయింట్లతో రాయించే వారు. ప్రతీ స్కూల్‌లో రీడింగ్‌కు ఒక పీరియడ్ (లైబ్రరీ అవర్) ఇచ్చి అన్ని బుక్స్ అందుబాటులో ఉండాలి. తద్వారా పిల్లల్లో పుస్తకాలు చదివే అలవాటు పెరుగుతుంది.


డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి, మహిళా,శిశు సంక్షేమశాఖ,జిల్లా బాలల సంరక్షణాధికారి

• నా ఇంట్లో 400 పుస్తకాలున్నాయి



నాకు 20 ఏళ్ల వయసు నుంచి పుస్తకాలు చద వడం వ్యాప కంగా మారింది. స్వామి వివేకా నంద, మహాభారత, రామాయణ గాథలు, రమణ మహర్షి ఆశ్రమ లేఖలు, సైకాలజీ, బీవీ పట్టాభి రామ్,సినిమా హీరోలు మురళీమోహన్, శోభన్ బాబులు పుస్తకాలు చదివా.ఇటీవల కాలంలో సుఖనిద్ర పుస్తకం చదివా. టీవీ,సెల్‌ఫోన్లతో నిద్ర కరువైన రోజుల్లో ఈ పుస్తకాలు నిద్రకు ఉపక్రమిం చడంపై పలు చిట్కాలు ఉపయోగపడుతున్నాయి. నా దగ్గర ఉన్న పుస్తకాలను అనాథలకు, మెడి టేషన్ పుస్తకాలను తూర్పుగోదావరి జిల్లా లైబ్రరీకి ఇచ్చా. పుస్తకం పంచడం అంటే జ్ఞానాన్ని పంచ డమే. నా ఇంట్లోని ర్యాక్‌లో 400 పుస్తకాలు న్నాయి. శివాజీ మహరాజ్ కథలు, సర్వీస్ మేటర్స్ ఇతర రచయితలు పుస్తకాలు అన్నీ ఉన్నాయి. నా పిల్లలు చిన్నప్పటి నుంచి చదవే అలవాటు ఉంది.

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ జి.పాండురంగారావు, ఏలూరు



పుస్తక పఠనంపై తగ్గుతున్న ఆసక్తి

పిల్లల్ని చదివించే ప్రయత్నం అంతంత మాత్రమే..

పుస్తకాలు కొనలేకపోతున్నారు.. ఆసక్తీ పెంచలేకపోతున్నారు

ఆంధ్రజ్యోతి సర్వేలో వెల్లడైన విషయాలు



ఉమ్మడి జిల్లాలో ఏలూరు, భీమవరం, పాలకొల్లు పట్టణాల్లో 100 మందికి పైగా వివిధ వర్గాల నుంచి వివరాలు సేకరించాం. పుస్తకాలు చదువుతారా అని అడిగిన ప్రశ్నకు వీరిలో 66 శాతం మంది మాకు చదివే తీరిక లేదని గతంలో చదివే వాళ్లం అని చెప్పు కొచ్చారు. అడపా, దడపా ఆధ్యాత్మిక, ఉద్యోగ, హెల్త్ టిప్స్ పుస్తకాలు చదువుతున్నట్టు చెప్పారు. ఇక పిల్లలకి పుస్తకాలు కొంటారా అని అడిగితే అవసరమైనవి కొని ఇస్తామని 60 శాతం మంది, మరో 40 శాతం మంది కొని ఇవ్వడం లేదని వివరించారు. స్కూల్లో సిలబస్‌తోనే వారికి సమయం సరిపోవడం లేదని చెప్పుకొచ్చారు ఏమాత్రం సమయం చిక్కినా వారిని చెస్, క్యారమ్స్, క్రికెట్, ఇతర క్రీడల్లో శిక్షణ కోసం పంపిస్తున్నామని చెప్పుకొచ్చారు. మీరు చిన్నతనంలో పుస్తకాలు చదివారా అని అడిగితే 70 చదివామని 30 మంది చదవలేదని సమాధానం ఇచ్చారు.. అంటే ఆ కాలంలో పుస్తకాలు ఎక్కువగా చదివినట్టు అర్థం చేసుకోవచ్చు.. ఎందుకంటే ఫోన్లు ఇతర వ్యాపకాలు ఉండేవి కావు.. గ్రంథాలయాకు వెళ్లి చదువుకునే వారు ఎక్కువగా ఉండేవారు..ఎవరికైనా పుస్తకాలు బహుమతిగా ఇచ్చారా అని అడిగితే ఇచ్చామని 25 శాతం మంది సమాధానం ఇవ్వగా 75 శాతం మంది ఇవ్వడం లేదని చెప్పారు..ఇప్పుడు పుస్తకాలు బహుమతిగా ఎవరు ఇస్తున్నారని ఇచ్చినా ఎవరు చదువుతున్నారని ప్రశ్నించారు.

పుస్తకాలే మంచి నేస్తాలు



సెల్‌ఫోన్‌కు దూరంగా రంగులతో బొమ్మలు వేస్తున్న పాలకొల్లుకు చెందిన రవి కుమార్ నాలుగేళ్ల కుమారుడు

పాలకొల్లు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతోనే బాలల భవితకు మంచి బాటలు ఏర్ప డతాయన్నది పెద్దలమాట. పుస్తకాలే విజ్ఞాన గనులు అని పూజ్య బాపూజీ చెప్పేవారు. బాలల నీతి కథలు మనదేశంలోనే ప్రథమంగా వెలువడ్డాయి. బాలలను బాల సాహిత్యంవైపు ఆకర్షిం చడం, పుస్తక పఠనాసక్తిని కలిగించడం వంటి ఆశయాలతో ఏటా ఏప్రిల్ 2వ తేదీన అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం నిర్వహిస్తున్నారు. విష్ణు శర్మ రచించిన 'పంచతంత్రం' కథలు తొలి బాలసాహిత్యం అని చెప్పవచ్చు. పుస్తక పఠనం బాలల వ్యక్తిత్వం వికసితమవు తుంది. తెలుగులో తొలిసారిగా జన వినోధిని పత్రిక (1875-85) బాలలకోసం ప్రత్యేక సంచికలు ప్రారంభించింది. 1947లో నాగిరెడ్డి, చక్రపాణిలు చందమామ మాస పత్రికను ప్రారంభిం చారు. బాల సాహిత్యానికి చందమామ బాటలు వేస్తే, బాలమిత్ర, బొమ్మరిల్లు బుజ్జాయి వంటి మాస పత్రికలు పిల్లలను ఎంతగానో అలరించేవి. సుప్రసిద్ధ రచయితలు రావూరి భరద్వాజ, ఇల్లిందల సరస్వతిదేవి, న్యాయపతి రాఘవరావు, ఏడిద కామేశ్వరరావు, తురగాజానకీరాణి వంటి వారు బాలల కోసం ప్రత్యేక చనలు చేశారు. పుస్తక పఠనంతో బాలల్లో సమాజం పట్ల అవగాహన ఏర్పడుతుంది. పిల్లలకు చిన్న చిన్న కథలు వినిపిస్తూండాలి. చిత్రాలు (బొమ్మలు)తో కూడిన ఆసక్తి కరమైన పుస్తకాలను పిల్లలకు ఇవ్వాలి. దీంతో చిన్నారులు పుస్తకాల పట్ల ఆకర్షితులవు తారు. జ్ఞానాన్ని వారసత్వంగా అంది స్తున్నది పుస్తకాలు మాత్రమే. ఇంట ర్నెట్‌లో పుస్తకాలు చదివే పిల్లల్లో సహజ ఎదుగుదల మంద గిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పుస్తకపఠ నాన్ని తల్లిదండ్రులు బాధ్యతగా స్వీక రించి పిల్లలతో చిన్నతనం నుంచి చదివించినప్పుడే బాల్యం మానసిక వికా సానికి దోహద పడుతుందని చెప్పవచ్చు.

• ఆధ్యాత్మిక పుస్తకాలతో ఎంతో ఆనందం..



ఆధ్యాత్మికంగా, మానసిక ప్రశాంతత కోసం నేను స్వామి వివేకానంద, రామకృష్ణ పరమ హంస పుస్తకాలతో పాటు ఒక యోగి ఆత్మ కథలు చదవాను. వీటితో మానసిక ప్రశాంతత లభించింది. పంచాయతీరాజ్ చట్టం, సర్వీస్ రూల్స్, ఆర్‌టీఐ, ఏపీ సబార్డినేట్ రూల్స్‌కు సంబంధించిన పుస్తకాలు కొని చదువుతుంటాను. వీటి వల్ల తోటి ఉద్యోగులకు సమస్యలు వచ్చినప్పుడు అధిగమించడానికి ఉపయోగపడ్డాయి. పేదలకు, అనాథలకు పుస్తకాలు కొని అందిస్తుంటాను. పుస్తకాలు పంచడం ఒక సామాజిక సేవలాంటిదే

తాడిమేటి వెంకట కిశోర్, ఉద్యోగి,ఏలూరు

• పుస్తకాలతో మోటివేషన్ పొందా..



నా చిన్నతనం నుంచి పుస్తకాలు చదివే అలవాటు ఉంది. మార్కెటింగ్ రంగంలో ఉన్నతంగా ఎదగడానికి నేను ది ఫైర్, యండమూరి వీరేంద్రనాథ్ విజయానికి ఐదు మెట్లు చదివా. బిజెనెస్ సక్సెస్ కోసం వేణు భగవత్ రచనలు ఎక్కువగా చదివాను. మనీ పర్స్ , డబ్బు ఆదా మార్గాలపై ఈ పుస్తకం నాకెంతో ఉపయోగపడింది. నాకు నాలుగేళ్ల పాప ఉంది. ఆమెకు వివిధ బొమ్మలతో కూడిన పుస్తకాలు కొని ఇచ్చాను.

విజయ్ కుమార్, మార్కెటింగ్ ఉద్యోగి, ఏలూరు

• సెల్‌ఫోన్‌తో పుస్తక పఠనం పోయింది



పూర్వం ఎవరి ఇంట్లో చూసినా పుస్తకం చదు వుతూ కనిపించేవారు. ఇప్పుడు ఎక్కడచూసినా సెల్‌ఫోన్ చూస్తు కనిపిస్తున్నారు. పుస్తకపఠనమే మరిచిపోయారు. తల్లిదండ్రులు కూడా చెప్పడం లదు. పిల్లల చేత చారిత్రాత్మక వ్యక్తుల జీవితా లకు సంబందించిన పుస్తకాలు చదివిస్తేవారి పై మంచి ప్రభావం కనిపిస్తుంది. పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలి.

చెరుకువాడ రంగసాయి, సోషల్ వర్కర్, భీమవరం

• పిల్లలను గ్రంథాలయాలకు తీసుకువెళ్లాలి



పిల్లలను తప్పని సరిగా గ్రంథాలయాలకు తల్లి తండ్రులు తీసుకువెళ్లాలి. దీనివల్ల పుస్తకపఠ నంపై ఆసక్తి పెరుగుతుంది. సెలవు రోజుల్లో పార్కులకు ఎలా తీసుకువెళ్తారో ఒక రోజైనా గ్రంథాలయాలకు తీసుకువెళితే వారికి ఆలోచన మారుతుంది. పుస్తక పఠనం వల్ల ఎంతో ఉపయోగం ఉంది. పఠనం లేకపోతే భవిష్యత్తులో పుస్తకం అంటే తెలియ పరిస్థితి వచ్చే అవకాశం ఉంది.

దాయన సురేష్ చంద్రాజీ, రిటైర్డ్ ప్రిన్సిపాల్, భీమవరం



నటీ నటులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

ఆకట్టుకున్న అనూహ్యం నాటకం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్ర జ్యోతి): తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రంలో నిర్వహిస్తున్న ఉగాది నాటిక పోటీలు ఉత్సా హంగా సాగుతున్నాయి. సోమవారం రాత్రి పాలకొల్లు నటినట సంక్షేమ సమాఖ్య ఆధ్వ ర్యంలో ప్రదర్శించిన అనూహ్యం నాటిక తండ్రి ఆస్తిని కాజేయడానికి కొడుకులు పన్నిన పన్నా గం ఎత్తులు ఆలోచింపచేసింది. నాటిక తిలకిం చిన ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ నటీనటులను అభినందించారు. బీవీఆర్ కళా కేంద్రం వ్యవ స్థాపకుడు బుద్దాల వెంకట రామా రావు, బీజేపీ నాయకుడు గట్టిం మాణిక్యాలరావు పాల్గొన్నారు.

అలివేరులో ఘనంగా మామిడికాయ పండుగ



మామిడికాయల పండుగలో పాల్గొన్న కొండరెడ్లు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పూర్వకాలం నుంచి ఏటా అనవాయితీగా జరుపు కునే మామిడికాయల పండుగను మంగళవారం అలివేరులో కొండరెడ్డి గిరిజనులు సందడిగా చేశారు. పెద్దలు కరకాల సోమరాజురెడ్డి, చర్ల బుల్లెమ్మల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకు న్నారు. పండుగలో ఆడ, మగ, చిన్నా, పెద్దా తేడా లేకుండా జనాలంతా పాల్గొని డోలు కొయ్యలు, గిల్లకాయలతో ఆడుపాడుతూ నృత్యాలు చేశారు. కొండరెడ్లు మామిడికాయ పండుగను చేయకుండా మామిడికాయలను ముట్టుకోరు. పండుగ తర్వాతనే వాటిని తిం టారు. అంతవరకు చాలా నిష్టగా ఉంటారు. మామిడికాయ పండుగతో పాటు దారి పండుగ, చింతల పండుగ, చిక్కుడు పండుగ, పప్పు పండుగలను చేస్తారు. అన్నిటికంటే మామి డికాయల పండుగను ఘనంగా నిర్వహిస్తారు. పండుగ జరుపుకునే రోజున చుట్టుపక్కల గ్రామాలవారిని ఆహ్వానిస్తారు. పండుగలో అటవీ ప్రాంతంలో మాత్రమే దొరికే జీలుగు కల్లు, తాటికల్లు తప్పకుండా ఉంటుంది. పండు గకు వచ్చినవారందరికి కల్లు, మాంసం కూర లతో భోజనాలు పెట్టి ఇళ్ళకు పంపుతారు.

గుర్రపుడెక్కలో పోషకాలెన్నో

కంపోస్టు ఎరువు తయారీలో వినియోగం

తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం



ఆకివీడు రూరల్ ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎందుకూ పనికిరాదు అనుకున్న గుర్రపుడెక్క నుంచి కూడా ప్రయోజనాలు తెలిస్తే ఆశ్చరపోవాల్సిదే. కాలువలలో పేరుకుపోయి, నీటి ప్రవాహానికి అడ్డంగా మారి, పంటలను నాశనం చేస్తూ, రైతులను కన్నీరుపాలు చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఖర్చు రూపంలో తలనొప్పులు తీసుకు వస్తున్న గుర్రపుడెక్క వల్ల కూడా రైతులకు ఉపయోగాలున్నాయని చెబుతున్నారు వ్యవసాయ శాఖ అధికారులు. సృష్టిలో పనికిరాని వస్తువే లేదు... ఉప యోగించుకోవడం తెలియక అన్న నానుడి అక్షర సత్యం చేస్తున్నది గుర్రపు డెక్క. గుర్రపుడెక్క తొలగించడానికి రైతులు, అధికారులు, ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కానిని కంపోస్టు ఎరువుకు ఉపయోగించవచ్చునని అధికారులు తెలియజేస్తున్నారు. దీనిలో అనేక పోషకాలున్నాయి. గుర్రపుడెక్కను సేకరించి కంపోస్టు ఎరువు తయారు చేసి ఆదాయంగా మార్చుకోవచ్చని తెలియ జేస్తున్నారు. గుర్రపుడెక్కలో నత్రజని, భాస్వరం (ఫాస్పరస్) పోటాషియం, సేంద్రీయ కర్బనం, బోరాన్, కాపర్, మాంగ నీసు, నికెల్, జింకు, ఐరన్ ఉంటాయి. పశువులు వ్యర్థాలలో కన్నా ఎక్కువగా ఉంటాయి. వేసవికాలంలో వర్మీ కంపోస్టు తయారీ జరగదు. కాని గుర్రపుడెక్కతో సాధ్యమ వుతుంది. ప్రధానంగా మొక్కలకు అవసర మైన నత్రజని 2.60% భాస్వరం (ఫాస్పరస్)1.5%, పోటాషియం 1.85, కాపర్ 100 ఎంజీ, ఐరన్ కే జీకి 1000 మి.గ్రా, జింక్ 100 మి.గ్రా లభిస్తుందని లెక్కల ద్వారా తెలుస్తున్నది. గుర్రపుడెక్క సేకరణ కూడా ఖర్చుతో కూడినది కాదు. కాలువలలో గుర్రపుడెక్క అధికంగా కనిపిస్తుంది. గుబు రుగా ఉండే దీని వేర్లు నీటిలోని పోషకాలను పట్టి ఉంచుతాయి. సారవంతమైన మట్టిని కలిగి ఉంటాయి. కంపోస్టు తయారీకి పిట్‌ను ముందుగా ఏర్పాటు చేసుకోవాలి, దీనికే ఖర్చు అవుతుంది. కాలువలలో నుంచి గుర్రపుడెక్క సేకరించుకుని ముక్కలుగా చేసుకుని పశువుల వ్యర్థాలతో కలిపి పిట్‌లో వేసుకోవాలి. కంపోస్టు అవ్వడానికి రసాయనాలు ఉపయోగించుకుంటే ఏడు వారాలలో కంపోస్టు తయారవుతుంది. వేసవికాలంలో కూడా ఈ కంపోస్టు తయారు చేసుకోవచ్చు. ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఈ కంపోస్టు తయారు చేసుకోనే అవకాశాన్ని అప్పగించనున్నది. జిల్లాలో ఆకివీడు మండలం సిద్ధాపురంలో పైలెట్ ప్రాజెక్టుగా తయారు చేయడం ప్రారంభించనున్నారు. విజయవంతం అయితే ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు ఖర్చు తగ్గుతుంది. వరదల సమయంలో అయితే దీనిని వల్ల ముంపు బారిన పడుతున్నాయి. యంత్రాలతో తొలగించాల్సి వస్తున్నది. ఈ ప్రక్రియ ప్రారంభిస్తే రైతులకు గుర్రపుడెక్క బాధ తగ్గుతుంది. సాగునీటి కోసం రైతులు కష్టాలు పడనవసరం లేదు. శివారు ప్రాంతాలకు సైతం సమృద్ధిగా నీరందుతుంది.

• ఆదాయం మార్గం

గుర్రపుడెక్కలో మేలు చేసే మంచి పోషకాలున్నాయి. అతి తక్కువ ఖర్చుతో దీనితో కంపోస్టు తయారు చేయవచ్చును. దీని ద్వారా సంవత్సరానికి రూ.1లక్ష వరకు ఆర్జించవచ్చును. దీని ద్వారా ఉపాధి కలు గుతుంది. రైతులకు పుష్కలంగా నీరందు తుంది, ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు ఖర్చు తగ్గుతుంది. ప్రతి గ్రామంలో కంపోస్టు పిట్‌లున్నాయి. వీటి ద్వారా కంపోస్టును తయారు చేసుకోవచ్చును.

వెంకటేశ్వరరావు, డీఎవో పశ్చిమగోదావరి జిల్లా



గురూ..ఐడియా అదిరింది !

బైకుకి గొడుగు సెట్టింగ్

అసలే ఎండలు దారెత్తిస్తున్నాయి. బైక్‌పై బయటకు వెళ్లాలంటే వంట్లో నీరంతా ఆవిరై వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. కానీ పొట్టకూటి కోసం బయట తిరగక తప్పని పరిస్థితులు..ఎండ నుంచి తప్పించుకోవడం ఎలా అని ఆలోచించి ఇదిగో ఇలా సెట్టింగ్ చేశాడు.. తూర్పుగోదావరి జిల్లా తాళ్ళపూడి మండలం పక్కిలంక గ్రామానికి చెందిన కంప్యూటర్ మెకానిక్ బాణాల సాయి నరసింహమూర్తి. తన బైకు హ్యాండిల్‌కి గొడుగు పెట్టుకునే విధంగా ఒక పైపుని తయారు చేయించి బైకుకి అమర్చాడు. దానికి మామూలు గొడుగైతే వేగానికి విరిగిపోతుంది పైగా పూర్తి నీడనివ్వదు. గొడుగు వెనుక తోకలా ఉండి వెనుక నుండి కూడా ఎండ తగలకుండా ఉండే గొడుగుని కొనుగోలు చేసి బైకుకి అమర్చాడు. ఎండ తగలకుండా ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్లి కంప్యూటర్లు రిపేరు చేస్తున్నాడు. - పోలవరం (ఆంధ్రజ్యోతి)


పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతున్న సూర్యకుమారి

సాంకేతిక ఆధారిత పరిశ్రమలు రావాలి

భీమవరం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాంకేతిక ఆధారిత పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు దృష్టి సారించాలని పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధి ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సమావేశంలో జిల్లా కలెక్టర్‌తో కలిసి జిల్లా ప్రత్యేక అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజరైన పారిశ్రామిక వేత్తల నుంచి ఉత్పత్తి యూనిట్లు, ముడి సరుకుల సేకరణ, మార్కెటింగ్, బ్యాంకు రుణాలు మంజూరు, పరిశ్రమల నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర విషయాలను అడిగితెలుసుకున్నారు. పారిశ్రామికవేత్తలు ఎస్.దిలీప్ కుమార్ (కోకోనట్ క్లస్టర్), వెంకటేశ్వరరావు (మష్రూమ్‌పౌడర్), హరీష్ (చాక్లెట్ తయారీ), డాక్టర్ బాబు (ప్లాస్టిక్ చిప్స్), దుర్గారావు (ప్లాస్టిక్ వేస్ట్ నుంచి పీవీసీ పైప్స్ తయారీ), చైతన్య (ఆమోన్స్ పికిల్స్), వాసు (ప్రింటింగ్ క్లస్టర్), పాండు (ఫర్నిచర్ క్లస్టర్) , నారాయణ రావు ప్రోగ్రెసివ్ ఫార్మర్ తదితరుల సమావేశంలో సంబంధిత తయారీ ఉత్పత్తుల గురించి జిల్లా ప్రత్యేక అధికారికి వివరించారు. సమావేశం దృష్టికి తీసుకు వచ్చిన విషయాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి కార్యాచరణను రూపొందించి అమలు చేస్తానని జిల్లా యంత్రాంగం తరపున హామీ ఇచ్చారు. ప్రతినెల జిల్లా కలెక్టర్ తో కలిసి సమావేశం నిర్వహిస్తామన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉత్పత్తులు తయారీలో పోటీ పడాలన్నారు.

వర్క్‌ఫ్రమ్ హోం సర్వే పూర్తి చేయండి : కలెక్టర్

ఏలూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 18 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు ఉండి ఆధునిక సాంకేతిక అంశాలపై అవగాహన, విద్యార్హత కలిగిన వారికి వర్క్‌ఫ్రమ్ హోమ్ ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేం దుకు చేపట్టిన సర్వేను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి డీఎల్‌డీవోలు, ఎంపీడీవో లతో మంగళవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వే, జీఎస్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించిన వివిధ అంశాలపై కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించారు. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.


వివరాలు చెబుతున్న ప్రభుత్వ వైద్యుల బృందం

విషమంగానే ఫార్మసిస్ట్ ఆరోగ్యం

ప్రభుత్వ వైద్యుల బృందం వెల్లడి

న్యాయం చేయాలని తల్లిదండ్రుల డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెంకు చెందిన ఎస్.నాగాంజలి(ఫార్మసిస్ట్) ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని ప్రభుత్వ వైద్యుల బృందం వెల్లడించింది. రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో మంగళవారం బోధనాసుపత్రి జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, అనస్థీషియా ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ అనిల్‌కుమార్, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సీహెచ్ నీలిమ విలేకరులతో మాట్లాడారు. రోజు రోజుకు ఇన్‌ఫెక్షన్ పెరుగుతున్నదన్నారు. గత నెల 28వ తేదీ నుంచి బాధిత యువతి ఆరోగ్యంపై ఫాలో అవుతున్నామన్నారు. బ్రెయిన్‌కు ఆక్సిజన్ తగ్గిపోవడం వల్ల డ్యామేజీ ఎక్కువగా జరిగిందని భావిస్తున్నామన్నారు. పేషెంట్‌ను ప్రస్తుత పరిస్థితుల్లో వేరేచోటకు షిఫ్ట్ చేసే అవకాశం లేదని, ఆరోగ్య పరిస్థితి అంత క్రిటికల్‌గా ఉందన్నారు. బీపీ డౌన్ అవుతోందని, ఫీవర్ పెరుగుతున్నదన్నారు. జాండీస్ కూడా వచ్చిందన్నారు. బొల్లినేని ప్రైవేట్ ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ పూర్తిస్థాయిలో జరుగుతున్నదని పేర్కొన్నారు. ఇలా ఎన్ని రోజులు కండిషన్ ఉంటుందనేది చెప్పలేమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా వైసీపీ నాయకులు మాజీ ఎంపీ భరత్‌రామ్, యాంకర్ శ్యామల, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి ఆసుపత్రి ఐసీయూలో ఉన్న నాగాంజలిని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం డీఎస్పీని కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. ఇదే ఆసుపత్రిలో అంజలి ఇంజక్షన్ చేసుకుందని కానీ ఆ దృశ్యాలు రికార్డయిన సీసీ ఫుటేజీని మాత్రం ఇప్పటి వరకు బాధిత తల్లిదండ్రులకు ఇవ్వలేదన్నారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.నాగాంజలి తల్లిదండ్రులు మాట్లాడుతూ మా బిడ్డను మాతో ఆరోగ్యంగా పంపాలన్నారు. పది రోజులుగా ఎటువంటి మార్పులేదని మాలాంటి పరిస్థితి ఎవ్వరికి రాకూడదన్నారు.

విజయవాడ-మచిలీపట్నం రహదారిపై ప్రమాదం

మోటార్ సైకిల్‌ను ఢీకొన్నకారు.. పాలకొల్లు వాసులకు గాయాలు

గూడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై చిట్టి గూడూరు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాలకొల్లుకు చెందిన పి. దామోదర్‌రెడ్డి, సి. రామారావు, బేబీ, మరో మహిళ కారులో విజయవాడ నుంచి పాలకొల్లు వెళుతుండగా, విజయవాడకు చెందిన ఎస్. ఫణి తన ద్విచక్ర వాహనంపై మచిలీపట్నం వైపు వస్తుండగా వెనుక నుంచి వస్తున్న కారు ఫణి ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొంది. దీంతో ఫణికి బలమైన గాయాలయ్యాయి. కారు వేగంగా వెళ్ళి పక్కనే ఉన్న పంట బోదెలో తిరగబడింది. కారులో ప్రయాణిస్తున్న దామోదర్‌రెడ్డి, రామారావు, బేబీ మరో మహిళకు గాయాలయ్యాయి. వీరిని బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఫణి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. గూడూరు ఎస్ఐ కె.ఎన్.వి. సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ సమయంలో విజయవాడ నుంచి మచిలీపట్నం వస్తున్న జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ రోడ్డు ప్రమాదాన్ని చూసి రోడ్డు మొత్తాన్ని సిబ్బందితో క్లియర్ చేయించారు. వెంటనే అంబులెన్స్‌లను సంఘటనా స్థలానికి పంపించారు.

'డైట్'లో అధ్యాపకుల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : దూబచర్లలోని డైట్(జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ)లో ఖాళీగా వున్న వివిధ సబ్జెక్టుల అధ్యాపక పోస్టులను ఫారిన్ సర్వీసు(ఎఫ్ఎస్‌టీసీ)పద్ధతిపై ఇన్‌సర్వీసు ఎంఈవో/హెచ్‌ఎం/స్కూల్ అసిస్టెంట్లతో పరిమితకాలానికి లోబడి డిప్యూటేషన్లపై భర్తీచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న సంబంధిత కేడర్ విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఏ ఉపాధ్యాయులు నియామకాల మార్గదర్శకాలను గూగుల్ లింక్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలను డీఈవో ఏలూరు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.


మద్ది ఆలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు

ఆటిజం.. శాపమా!

» ఇది వ్యాధి కాదు.. పిల్లల్లో కనిపించే మానసిక లక్షణం » పెరుగుతున్న ఆటిజం పిల్లల సంఖ్య

» మానసిక ఎదుగుదల ఉండదు » మాటలు రావు.. ఇతరులతో కలవలేరు

నేడు ప్రపంచ ఆటిజం అవగాహన దినం

తణుకు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆటిజం ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్న పదం. ఇది ఒక న్యూరో డెవలప్‌మెంటల్ డిజార్డర్. ఇది పిల్లల్లో కనిపించే లక్షణం. దీన్ని ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అని పిలుస్తారు. అనేక మానసిక వ్యాధులలో ఉండే లక్షణాలు దీనిలో కనిపిస్తాయి. కాబట్టి దీన్ని స్పెక్ట్రమ్‌గా పిలుస్తారు. ఇపుడు ప్రపంచ వ్యాప్తంగా చిన్న పిల్లల్లో ఎక్కువ సంఖ్యలో ఇది కనిపించడం ఆందోళన కలిగించే అంశంగా చెప్పవచ్చు. ప్రతి 68 జననాలలో ఒకరికి ఆటిజం అనే డిజార్డర్ వస్తున్నట్టుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెబుతున్నాయి.

ఆటిజం లక్షణాలు

సామాజిక నైపుణ్యాలు తగ్గిపోవడం. అంటే ఇతరులతో కలవలేకపోవడం, మాటలు రాకపోవడం, ముఖ్యంగా వచ్చిన మాటలు కూడా రెండు సంవత్సరాల వయస్సులో పోవడం, పలికిన పదం మళ్ళీ మళ్ళీ పలకడం (ఎకొలాలియా), కళ్లల్లోకి చూసి మాట్లాడకపోవడం (ఐ కాంటాక్ట్ సరిగా లేకపోవడం) వంటి లక్షణాలు ప్రధాన ంగా కనబడతాయి. అయితే వీటితో పాటు కొన్ని ఇతర మానసిక సమస్యలు కూడా ఆటిజంతో కలిసి ఉంటాయి. దీని ని కో మార్బిడిటీ కండిషన్ అంటారు. ఏకాగ్రత లేకపోవడంతో పాటు హైపర్ యాక్టివిటీ (ఏడీహెచ్‌డి), బుద్ధి మాద్య ం, లెర్నింగ్ డిజార్డర్ వంటి సమస్యలు కలిసినపుడు ఈ డిజార్డర్ మరింత ఇబ్బందికరంగా మారుతుంది.

ఇది ఎందుకు వస్తుంది..

ఆటిజం వ్యాధి కాదు. ఇది ఒక డిజా ర్డర్ మాత్రమే. అయినప్పటికీ దీనివల్ల పిల్లల అభివృద్ధి కుంటుపడుతుంది. ముఖ్యంగా నేర్చుకోవడంలో వెనుకబడతారు. సోషల్ స్కిల్స్ విషయంలో వెనుకబాటు ఉండటం వల్ల బంధాలు, అనుబంధాల విషయంలో వెనుకబాటు ఉంటుంది. ఇది పిల్లలలో రావడానికి ఇప్పటి వరకు స్పష్టమైన కారణాలు తెలియవు. ఇప్పటికీ దీని మీద పరిశోధన జరుగుతూనే ఉంది. అయితే అందుబాటులో ఉన్న సమాచారం మేరకు జీన్స్‌లో చోటు చేసుకునే లోపాలు అంటే వంశపారంపర్యం ఒక కారణం. అంతే కాకుండా ఆలస్యంగా (ఎక్కువ వయస్సు అంటే 30 కి పైబడిన వయస్సు) గర్భం దాల్చడం, తల్లిదండ్రులకు ఆల్కహాల్, సిగిరె ట్ స్మోకింగ్, డ్రగ్స్ వంటి అలవాట్లు ఉండటం ఒక కారణంగా చెప్పచ్చు. గర్భం ధరించినప్పటి నుంచి సమతుల ఆహారం, వాక్సినేషన్, గర్భం ధరించిన కాలం, డెలివరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, ఇతర మెడికల్ కారణాలు ఈ డిజార్డర్ రావడానికి ఒక ముఖ్య కారణం.

ఏ వయసులో గుర్తించవచ్చు...



దీనిని ఆరు నెలల వయస్సు ఉన్నపుడే గుర్తించవచ్చు. కానీ దురదృష్టవశాత్తు 6 సంవత్సరాల తరువాత కాలంలో ఎక్కువ మంది తల్లిదండ్రులు గుర్తించి నిపుణుల వద్దకు చికిత్స నిమిత్తం తీసుకువెళుతు న్నారు. దీని వల్ల ఫలితం తక్కువగా ఉంటుంది. ఆరు నెలల కాలంలో పిల్లవాడు వాడితో మాట్లాడుతున్న వాడితో ఐ కాంటాక్ట్ సరిగా లేనపుడు ఆటిజంగా అనుమానించ వచ్చు. అలాగే



స్పీచ్ విషయంలో మొదటి 10 నెలల వయస్సు వచ్చే సరికి మొదటి పదం పలకడం వస్తుంది. అక్కడి నుంచి పదాలు పలుకుతారు. కానీ ఈ డిజార్డర్ ఉన్న పిల్లలు శబ్దాలు పలకడం, పదాలు పలకడం విషయ ంలో వెనుకబడతారు. కొంతమంది పిల్లల్లో అసలు పదాలు పలకని పరిస్థితి ఉండవచ్చు. అంతేకాదు శూన్యంలోకి చూస్తూ ఉంటారు. ఇలా చాలా సేపు చూస్తారు. ఇది ఇబ్బందికర పరిణామం. ఈ డిజార్డర్‌తో పాటు ఏడీహెచ్‌డీ కూడా కలిపి ఉన్నపుడు ఇతర పిల్లలను కొట్టడం, అల్లరి ఎక్కువ చేయడం, చెబుతున్న విషయాల పట్ల ఏకాగ్రత చూపలేకపోవడం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. ఇలాంటి సందర్భంలో తల్లిదండ్రులు మేలుకోవాలి. సత్వ ర చికిత్సకు తీసుకు వెళ్ళడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.

ఎలా నిర్ధారిస్తారు?

ఈ డిజార్డర్‌ను మొదట తల్లిదండ్రులు గమనించగలరు. వీరు నిపుణుడి వద్దకు వెళ్ళి తమ పిల్లల వెనుకబాటుకు కారణం అడిగినపుడు నిపుణుడు లక్షణాల ఆధారంగా నిర్ధారణకు రాగలడు. అయితే ఎం చాట్, ఈసా వంటి కొన్ని సైకోమెట్రీ పరీక్షలు కూడా అందుబాటులో ఉంటాయి. వాటి సహాయంతో డిజార్డర్ ఉందా... లేదా.. ఉంటే ఏ స్థాయిలో ఉంది అనే విషయాలను నిర్ధారించుకోవచ్చు.

- పశ్చిమగోదావరి జిల్లాలో 13 మంది ఆటిజం బాధితులు ఉన్నారని డీఎం అండ్‌హెచ్‌వో గీతాబాయి తెలిపారు. తణుకులోని ప్రభుత్వ ఆస్పత్రిలో వీరికి చికిత్స అందిస్తున్నారు. అయితే ప్రభుత్వం దృష్టికి రాని పిల్లలు వందల సంఖ్యలో ఉంటారని అంచనా.

త్వరగా చికిత్స అందిస్తే మంచి ఫలితాలు



దీన్ని పూర్తి స్థాయిలో తగ్గించడానికి చికిత్స అందుబాటు లో లేదనే చెప్పాలి. కానీ తొందరగా గుర్తించి చికిత్సను ప్రారంభిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. పిల్లలకు 0 నుంచి 3 సంవత్సరాల వయ స్సు వరకు న్యూరోప్లాస్టిసిటీ అవకాశాలు ఎక్కువ ప్రయోజనాన్ని కలిగించేదిగా ఉంటుంది. ఈ సమయంలో చేసే చికిత్సలు వేగంగా ఫలితాల్ని ఇస్తాయి. దీని వల్ల పిల్లవాడు వీలైన స్వయం సమృద్ధి తన అవసరాల విషయంలో పొందుతారు. ఇక చికిత్సా పద్ధతుల గురించి ఆలోచిస్తే.. బిహేవియర్ మోడిఫికేషన్, సెన్సరీ ఇంటిగ్రేషన్, ఆక్యుపేషనల్ థెరపి, స్పీచ్ థెరపి అవసరం అవుతాయి. ఇలాం టి చికిత్సా విధానాలకు క్వాలిఫైడ్ నిపుణులను (రీ హేబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చేత గుర్తించబడి న) ఎంచు కోవడం వల్ల డబ్బు, సమయం ఆదా కావడమే కాకుండా పిల్లవాడి భవిష్యత్‌కు వీలైనంత మేలు చేసినట్లవుతుంది.

- యనమండ్ర రామకృష్ణ, క్లినికల్ సైకాలజిస్టు, ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్, తణుకు

వృద్ధురాలిపై దాడి చేసిన నిందితుడి అరెస్ట్

ఎనిమిది కాసుల బంగారం స్వాధీనం


నిందితుడిని అరెస్టు చేసి వివరాలు చెబుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసకావడంతో పాటు ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో ఎలాగైనా దొంగతనాలు చేసి భారీగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్న ఒక యువకుడు చేసిన దొంగతనాన్ని పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భీమవరం గాంధీ నగర్‌కు చెందిన బి.విక్టర్ పాల్ కొంత కాలంగా ఖాళీగా ఉంటూ చెడు వ్యసనాలకు బానిసఅయ్యాడు. ఈ నేపథ్యంలోనే బేతనీపేట అమ్మిరాజు తోటలో నివాసముంటున్న భార్యా భర్తలు యర్రంశెట్టి మంగతాయారు- వీరాస్వామి నాయుడు ఇంటికి గత నెల 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో విక్టర్ పాల్ వెళ్ళాడు. అద్దెకు ఇల్లు కావాలని, తాను దూరపు బంధువు అవుతానని, ఇంకా బంధువులు చూడటానికి వస్తున్నారని చెప్పి అక్కడే కూర్చున్నాడు. సాయంత్రం 4 గంటల సమయంలో మంగతాయారు భర్త వాకింగ్‌కు వెళ్ళిపోయాడు. దీంతో ఒంటరిగా ఉంటున్న మంగతాయారుపై వెంట తెచ్చుకున్న చైనా బ్లేడుతో మెడపై దాడి చేసి మెడలో ఉన్న నల్లపూసలు, తాడు, సూత్రాలను లాక్కుని పరారయ్యాడు. వెంటనే స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. వివరాలు సేకరించిన వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి నాలుగు బృందాలుగా పోలీసులు గాలింపు చేశారు. నిందితుడు గుర్తులనుబట్టి మంగళవారం బ్రిడ్జిపేట వంతెన వద్ద విక్టర్ పాల్‌ను అరెస్ట్ చేసి 64 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన డీఎస్పీ జయసూర్య, సీఐ నాగరాజు, సీసీఎస్ సీఐ రాంబాబు, వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్, పాలకోడేరు ఎస్ఐ రవివర్మ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఇంటి వెనుక నుంచి వచ్చి కాజేశారు..

లక్ష్మణేశ్వరంలో చోరీ.. వృద్ధ దంపతుల ఇంట్లో 20కాసుల బంగారం అపహరణ


ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ జయసూర్య, సీఐ దుర్గాప్రసాద్

నరసాపురం రూరల్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): లక్ష్మణేశ్వరం గ్రామంలోని సొసైటీ రోడ్‌లో మంగళవారం భారీ చోరీ చోటు చేసుకున్నది. రిటైర్డ్ ఉద్యోగి కె.సింహాచలం దంపతులు ఇంట్లో ఉండగానే దుండగులు ఇంటి వెనుక వైపు నుంచి వచ్చి 20 కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుని పోయారు. రాత్రి వృద్ధ దంపతులిద్దరూ ఏసీ గదిలో పడుకున్నారు. మధ్య రాత్రిలో వృద్ధ దంపతులు మరో గదిలోకి వచ్చి తలుపులు తీసి నిద్రలోకి వెళ్లిపోయారు. ఆ సమయంలో ఇంటి వెనుక వైపు నుంచి వచ్చిన దండగులు బీరువాలోని ఆభరణాలను దొంగించారు. భీమవరం డీఎస్పీ జయసూర్య, నరసాపురం సీఐ దుర్గాప్రసాద్ సంఘటన ప్రదేశానికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరును ఆరా తీశారు. జిల్లా నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించారు. దొంగల్ని పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు రూరల్ ఎస్ఐ వెంకట సురేశ్ చెప్పారు. ఇదిలా ఉంటే పక్కా ప్లాన్‌గానే ఈ చోరీ జరిగిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వృద్ధ దంపతులిద్దరు ఇంట్లో ఉంటున్నారు. వీటన్నింటిని గమనించి ప్లాన్‌గా ఈ చోరీ చేసి ఉండొచ్చన్న అనుమానాలు వినిపిస్తున్నాయి. ఆ దిశగా కూడా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి


పీహెచ్‌సీలో కార్మికుడికి సీపీఆర్ చేస్తున్న వైద్య సిబ్బంది

పెంటపాడు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : దూర ప్రాంతం నుంచి బ్రతుకు తెరువుకు వచ్చిన కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లా కేశవరం గ్రామానికి చెందిన బత్తుల వెంకటేష్(23) పెంటపాడు ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న సీసీ డ్రెయినేజీ పనుల నిమిత్తం తన సహచరులతో నాలుగు నెలల క్రితం వచ్చాడు. మంగళవారం డ్రెయినేజీలో ఉన్న నీటిని మిషన్ తో తోడుతుండంగా వైర్ ఎర్త్ కావడంతో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో తోటి సహచరులు అతడిని పెంటపాడు పీహెచ్‌సీకి తరలించగా అక్కడ సిబ్బంది సీపీఆర్ చేసినప్పటికి ఫలితం కానరాలేదు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కేసు

అత్తిలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో జీడీఎం చర్చి వద్ద అక్రమంగా ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్ఐ పి ప్రేమరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పంచా యతీ వారు జీడీఎం చర్చి వద్ద డ్రెయినేజీ పనులు జరుపుతుండగా ఆ పక్కనే చర్చికి సంబంధించిన వారు ఎక్స్‌కవేటర్ సాయంతో మట్టిని తవ్వుతుండగా స్థానికులు ప్రశ్నించారు. దీనితో వారిపై ప్రతాప్, సతీష్, చినబాబు, సురేంద్ర, దిలీప్ తదితరులు దాడి చేసినట్లు తెలిపారు. దీనిపై మేడపాటి నాని ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్ది క్షేత్రంలో పోటెత్తిన భక్తులు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గురవాయిగూడెంలో మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం సందర్భంగా మద్ది ఆంజనేయునికి వేకువ జాము నుంచి ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. వివిధ సేవల రూపంలో స్వామివారికి రూ.లక్షా డెబ్బై ఏడు వేల తొమ్మిది వందల ముప్పై ఒక్క రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈవో ఆర్‌వి.చందన తెలిపారు.

విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు

స్కూల్ వద్ద తల్లిదండ్రులు ఆందోళన

నరసాపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మిషన్ హైస్కూల్ రోడ్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థిని టీచర్ కొట్టడంతో తల్లిదండ్రులు స్కూల్ వద్ద ఆందోళనకు దిగారు. వీరికి ఎస్ఎఫ్ఐ సంఘీభావం తెలిపి తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపట్టారు. దీంతో స్కూల్ వద్ద రెండు గంటల పాటు టెన్షన్ నెలకొంది. విద్యార్థుల్ని కొట్టడం, మానసిక వేధింపులకు గురి చేస్తున్న స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. చివరికి ప్రిన్సిపాల్ మరోసారి ఇటువంటి సంఘటనలు జరగనివ్వమని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బంగారు పుస్తెలతాడు అపహరణ

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన అప్పన రామాంజనేయులు తల్లికి చెందిన నాలుగు కాసుల బంగారు పుస్తెలతాడు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకు పోయారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిటనట్లు హెచ్‌సి.మోషే తెలిపారు. మార్చి 30 వ తేదీన ప్రతీ రోజు లాగానే అప్పన రామాంజనేయులు తల్లి తన మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును తీసి ఇంట్లో పెట్టి నిద్ర పోయారు. తర్వాత రోజు ఉదయం లేచి చూడగానే బంగారు పుస్తెలతాడు కనిపించకపోగా ఇంట్లో బీరువా కూడా తెరచి అందులో ఉన్న వస్తువులు చిందర వందరగా పడవేసి ఉండటం గమనించి దొంగతనం జరిగిందని గ్రహించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

జీలుగుమిల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని మహిళ గాయపడిన సంఘటన రౌతుగూడెంలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన కొప్పుల నాగలక్ష్మి రహదారిపై నడిచి వెళుతుండగా బుట్టాయగూడెం వైపు నుంచి బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు నాగలక్ష్మీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఆమెను కామయ్యపాలెం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో జంగారెడ్డిగూడెం తరలించారు.

యువకుడికి పాము కాటు

జీలుగుమిల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో యువకుడు ఆస్పత్రి పాలైన సంఘటన పి.అంకంపాలెంలో చోటుచేసుకు న్నది. గ్రామానికి చెందిన ఈడా మోహన్ మంగళవారం వేరుశనగ చేలో పని చేస్తుండగా గుర్తు తెలియని పాముకాటుకు గురయ్యాడు. అతడిని కామయ్యపాలెం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి 108లో తరలించారు.

ఉంగుటూరులో వ్యక్తిపై దాడి

ఉంగుటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరులో మంగళవారం రాత్రి మార్లపూడి ప్రసాద్ అనే వ్యక్తిపై దాడి జరిగింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సేకరించవలసి ఉన్నదని చేబ్రోలు పోలీసులు తెలిపారు. ప్రసాద్ తాడేపల్లిగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఎస్ఐ సూర్య భగవాన్ తెలిపారు.

చెరువుల వద్ద మోటార్లు చోరీ

యలమంచిలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మేడపాడు గ్రామం హెచ్‌పీ పెట్రోలు బంకు ఎదురుగా తాను సాగు చేస్తున్న ఆక్వా చెరువుల వద్ద ఉన్న 13 మోటార్లు సోమవారం రాత్రి చోరీకి గురైనట్లు ఆక్వా రైతు టి.నాగ ప్రసాద్ తెలిపారు. ఈ మోటార్ల విలువ సుమారు రూ.1.5 లక్షలు ఉంటుందన్నారు. ఈమేరకు యలమంచిలి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ప్రసాద్ తెలిపారు.

కొడుకు దాడి చేశాడంటూ తల్లి ఫిర్యాదు

భీమవరం క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భీమవరం బలుసుమూడికి చెందిన దేవరకొండ జ్యోతి భర్త ఐదేళ్ళ క్రితం మృతి చెందడంతో కుమారుడు, కుమార్తెతో ఉంటుంది. అయితే కుమారుడు ప్రభాకర్ వ్యసనాలకు బానిసై నిత్యం మద్యం సేవించి వచ్చి కొడుతున్నాడని, అలాగే చంపుతానంటూ బెదిరిస్తున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. గత నెల 29వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో ప్రభాకర్, వారి బంధువులైన వరప్రసాద్‌లు మద్యం సేవించి వచ్చి జ్యోతితో గొడవపడ్డారు. కత్తి తీసుకుని చంపుతానని బెదిరించడంతో ఆమె కంగారు పడింది. ఆమెకు కత్తి పిడి తగిలి గాయాలయ్యాయి. వెంటనే జ్యోతి చెల్లెలి నివాసానికి వెళ్ళి వైద్యం పొంది మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇజ్రాయెల్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వ్యక్తి జీవితంపై విరక్తి చెంది పురుగుమందుతాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెదపాడు మండలం సకల కొత్తపల్లి గ్రామానికి చెందిన సాకేటి సూర్యారావు (52)కు భార్య ఉన్నారు. వారికి సంతానం కలగలేదు. కాలేయం వ్యాధితో బాధపడుతున్నారు. మార్పిడి చేయడం కోసం దాతల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో దాతలు దొరకకపోవడం, అనారోగ్య ంతో తీవ్రంగా బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం పురుగు మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు రాగా కొద్దిసేపటికే మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

అత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్

కుక్కునూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఓ ఉద్యోగినిపై అత్యాచారానికి పాల్పడి ఆపై అప్పు తీసుకున్న డబ్బు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. కుక్కునూరు సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుట్టాయగూడెంకు చెందిన ఓ వివాహిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్నది. కుక్కునూరు మండలం దామచర్లకు గ్రామానికి చెందిన గొడ్ల అజిత్ కుమార్ 108 వాహనంలో ఈఎంటీగా పనిచేస్తున్నాడు. వృత్తి రీత్యా వీరిద్దరి మధ్య ఉన్న స్నేహాన్ని ఆసరాగా చేసుకుని మహిళా ఉద్యోగిని వద్ద తన కుటుంబ అవసరాల నిమిత్తం పలు సార్లు రూ.1.5 లక్షలు తీసుకున్నాడు. కొన్ని రోజులు గడిచిన అనంతరం ఆ మహిళ తన డబ్బు ఇవ్వమని అడిగింది. ఈ క్రమంలో గత సంవత్సరం నవంబరు నెలలో ఓ రోజు రాత్రి సమయంలో ఒంటరిగా ఉన్న మహిళ గదిలోకి వెళ్ళి అత్యాచారం చేశాడు. అనంతరం ఈ విషయం బయట ఎవరికైనా చెబితే ఆమెను అల్లరి చేస్తానని బెదిరించాడు. ఈ క్రమంలో తనకు రావల్సిన డబ్బులు అడుగుతుండగా ఆ మహిళపై అజిత్ కుమార్ చెడుగా ప్రచారం చేస్తు న్నాడు. దీంతో ఆ మహిళ మార్చి మూడవ తేదీన ఆత్మహత్యకు ప్రయత్ని ంచింది. అనంతరం కుటుంబ సభ్యులకు తెలియజే యడంతో వారు కుక్కునూరు పోలీస్ స్టేషన్‌లో మార్చి 26 న ఫిర్యాదు చేయగా అజిత్ కుమార్ పై కేసు నమోదు చేశారు. మంగళవారం అజిత్ కుమార్ ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యులు

పెంటపాడు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 3న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్ళు, జనరల్, ఊపిరితిత్తులు, చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధుల వైద్యులు ఉచిత వైద్య సేవలు అందిస్తారని, ఈసీజీ, అల్ట్రాసౌండ్ తదితర అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారని ప్రజ లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు డీఆర్‌జీలో జాబ్‌మేళా

పెంటపాడు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : పెంటపాడు డీఆర్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 3న దివీస్ ల్యాబ్ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. 25 ఏళ్ల లోపు బీఎస్సీ(కెమిస్ట్రీ), బీ.ఫార్మసీ, బీ.టెక్, ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎం.ఫార్మసీ) పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. తమ ఒరిజినల్ సరిఫికెట్స్, జిరాక్స్‌లతో ఉదయం 9 లోపు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 85000 67765 (ఇందిరమ్మ, అధ్యాపకురాలు) నంబర్ కు సంప్రదించాలన్నారు.

నేటి నుంచి సోపానం ఇంటర్వ్యూలు

పాలకోడేరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): 2024-25 సంవత్సరానికి సంబంధించి చంద్రన్న స్వయం ఉపాధి సోపానం దరఖాస్తుదారులకు పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, విస్సాకోడేరు, కెనరా బ్యాంక్, వేండ్ర పరిధిలో గల విస్సాకోడేరు, వేండ్ర, వేండ్ర అగ్రహారానికి చెందిన వెనుకబడిన తరగతులకు చెందిన 190 దరఖాస్తుదారులకు నేరుగా సంబంధిత బ్యాంకు అధికారులతో లబ్ధిదారుల గుర్తింపు కార్యక్రమం మంగళ, బుధవారాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందని ఎంపీడీవో వి. రెడ్డియ్య తెలిపారు. సంబంధిత దరఖాస్తుదారులు నిర్ధేశించిన సమయానికి హాజరు కావాలని కోరారు.

5 నుంచి నీటి విడుదల

నరసాపురం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5 నుంచి సబ్ డివిజన్ పరిధిలోని 80 మంచినీటి చెరువులకు నీటి విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ డీఈ వెంకటనారాయణ తెలిపారు. బుధవారం నుంచి నరసాపురం-నిడదవోలు పంట కాల్వకు ఐదో వంతు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. దాళ్వా పంటను చివరి దశలో ఊడ్చుకున్న రైతులు ఈ నీటిని సద్వినియోగపర్చుకోవాలన్నారు. 5 నుంచి మాత్రం ప్రజలకు ఈ వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా మంచినీటి ప్రాజెక్టులతో పాటు పంచాయతీ చెరువులకు తోడుకోవాలన్నారు.



బస్ సర్వీసును ప్రారంభిస్తున్న విప్ నాయకర్

నరసాపురం- ఉదయగిరికి కొత్త సర్వీస్

నరసాపురం టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నరసాపురం నుంచి ప్రకాశం జిల్లాలోని ఉదయగిరికి కొత్త సర్వీస్‌ను మంగళవారం విప్ నాయకర్, టీడీపీ ఇన్‌ఛార్జీ పొత్తూరి రామరాజుతో కలిసి ప్రారం భించారు. విజయవాడ మీదుగా ఈ సర్వీస్ నడవనుంది. నరసాపురంలో సాయంత్రం 4.15కి బయలుదేరి ఉదయం 6 గంటలకు ఉదయగిరి చేరుకుంటుంది. తిరిగి అక్కడ సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4 గంటలకు చేరుకుంటుంది. విజయవాడ, గుంటూరు, పామర్రు మీదుగా ఈ సర్వీస్ నడవనుంది. విప్ నాయకర్ మాట్లాడుతూ డిమాండ్ ఉన్న రూట్లలో సర్వీసులు నడుపుతామన్నారు. డీఎం సుబ్బన్నరెడ్డి, కోటిపల్లి సురేష్, కాగిత వెంకటేశ్వరరావు, గంటా కృష్ణ, తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, వనమాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం అనారోగ్య హేతువు

భీమవరం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకం అనారోగ్య హేతువని ఒంటెద్దు, తోపుడు బండ్ల సంఘం సభ్యులు శ్రీనివాస రావు, రుద్రాక్షుల మావుళ్ళయ్య, సన్యాసి రావు అన్నారు. నాచువారి సెంటర్‌లో మంగళవారం భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేదంపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వ రరావు మాట్లాడుతూ బుధవారం సోదాలు నిర్వహించి జరిమానాలు వేస్తామని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగ సాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేదంపై ఇంటింటి ప్రచారం చేస్తున్నామని అందరూ సహక రించాలని అన్నారు.

సీపీఎం అఖిల భారత మహాసభలకు బలరాం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఏప్రిల్ 2 నుంచి 7 వరకు తమిళనాడు రాష్ట్రంలో మదురైలో జరుగుతున్న సీపీఎం 24వ అఖిలభారత మహాసభలకు జిల్లా ప్రతినిధిగా బి. బలరాం హాజరవుతున్నారని ఆ పార్టీ జిల్లా కార్యాలయం మంగళవారం ప్రకటనలో తెలిపింది. రాష్ట్రం నుంచి 22 మంది ప్రతినిధులుగా, ఇద్దరు పరిశీలకులుగా వెళుతున్నారన్నారు.

వర్గీకరణపై జగన్ వైఖరి తెలపాలి : ఎంఆర్‌పీఎస్

పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ తన అభిప్రాయం తెలియచేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఏఎంసీ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర నాయకుడు పసుపులేటి చినబాబు మాట్లాడారు. వర్గీకరణ తన తండ్రి కోరికని, తాను అధికారంలోకి వచ్చాక కచ్చితంగా వర్గీకరణ చేస్తానని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం కనీసం మాదిగ నాయకులకు అప్పాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

మృతుల కుటుంబాలకు చేయూత

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పనిచేస్తూ గుండెపోటుతో మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు దూలపల్లి రాజు కుటుంబానికి గోదావరి భవన నిర్మాణ కార్మిక సంఘం తరఫున నాయకులు పడాల శ్రీను, పాలరాతి ఆదినారాయణ రూ.40 వేలు ఆర్థిక సాయం అందించారు. ఇంటి యజమాని దుట్టా వెంకటరాజు రూ.25వేలు, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రూ.10వేలు, తోటి కార్మికులు రూ.5 వేలు మొత్తం రూ.40వేలు అందించారు.

తణుకు: ఇటీవల చనిపోయిన డ్రైవరు పేకేటి మూర్తిబాబు కుటుంబానికి తణుకు స్కూలు, కాలేజి బస్ డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో రూ. యాభైవేలు అందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

తణుకు రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం పూర్తి స్థాయి న్యాయ విచారణ జరిపించాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాస్టర్ ఓ మనోజ్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం తణుకు మండల క్రైస్తవ సంఘాల జేఏసీ, తణుకు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో తణుకులో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

భీమవరం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పాలన అందిస్తోందని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. ఉగాది ఉత్సవాలు పల్లె పండుగలో భాగంగా వీరవాసరం మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లను ఆయన రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మితో కలసి ప్రారంభించారు. నవుడూరులో రూ. 36 లక్షలతో 3 సీసీ రోడ్లు, కొణితవాడలో రూ.13 లక్షలతో సీసీ రోడ్డు, ఉత్తరపాలెంలో రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు, రాయ కుదురులో రూ. 10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. అన్ని గ్రామాల్లోనూ సిమెంట్ రోడ్లు వేయిస్తున్నామన్నారు. పల్లెల్లో పండుగ వాతావరణం తెచ్చేలా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. జగన్ ప్రభుత్వం రోడ్లు వేయకుండా కాలయాపన చేసిందన్నారు.

పెరుగులంక భూములు పేదలకివ్వాలి

పెనుగొండ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సిద్ధాంతం గోదావరి పరివాహక ప్రాంతంలోని పెరుగులంక భూములను దళిత పేదలకు పంచాలని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కేతా గోపాలన్ అన్నారు. మంగళవారం పెనుగొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దళిత పేదలకు లంక భూములు సాధనలో ప్రాణత్యాగానికైనా సిద్ధమన్నారు. లంక భూములు అక్రమ తవ్వకాలు చేపట్టడానికి ఎదురుచూస్తున్న రాబంధులకు అధికారులు అడ్డుకట్టు వేయాలన్నారు. సీపీఎం నాయకులు ఎస్. వెంకటేశ్వరరావు, కెప్పల రత్నరాజు, నాగిశెట్టి గంగారావు, గుమ్మడి భాను పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ఆకివీడు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎండకాలంలో దాహార్తిని తీర్చడం పుణ్య కార్యక్రమమని ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు అన్నారు. నిమ్మల నాగు ఆధ్వర్యంలో స్థానిక మాదివాడ సెంటర్‌లో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రముఖులు ఉన్నారు.

మళ్లీ మార్కెట్ పాట!



మునిసిపల్ కార్యాలయం

» 180 శాతం ఆదాయం తగ్గడంతో పాత వేలంకు ఉన్నతాధికారులు నో!

» ఉద్యోగులతో రోజు వారీ వసూళ్లు

నరసాపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ మార్కెట్ పాట ఆదాయం నిర్దేశించిన ధర కంటే తగ్గడం, గత ఏడాదితో పోలిస్తే ప్రభుత్వానికి 180 శాతానికి పడిపోవడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. కౌన్సిల్ ఆమోదించకుండానే ఆ పాటను రద్దు చేయాలని స్థానిక మునిసిపల్ అధికారులకు మౌలిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో మళ్లీ పాట పెట్టేందుకు అధికారులు సిద్ధమవుతన్నారు. మరోవైపు పాట గడువు ముగియడంతో కొత్త ఆర్థిక సంవత్సరం తొలి రోజు మంగళవారం రోజువారి మార్కెట్ కలెక్షన్‌ను సచివాలయ, మునిసిపల్ ఉద్యోగులే చేపట్టారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మార్కెట్ పాట ప్రారంభ ధరను మునిసిపల్ అధికారులు రూ. 72 లక్షలుగా నిర్ణయించారు. మూడు సార్లు పాట పెట్టినా.. ఎవరూ ముందుకు రాలేదు. దీంత నాల్గోసారి ఉన్నతాధికారుల ఆదేశాలతో సీక్రెట్, బహిరంగ పద్ధతిలో నిర్వహించారు. ఇందులో పాట రూ. 30 లక్షల ఆరు వేలకు వెళ్లింది. సీక్రెట్ పద్ధతిలో రూ. 30 లక్షలకు, బహిరంగ వేలంలో మరో రూ. 6 వేలు పెంచి అదే పాటదారుడు పాడాడు. అయితే దీన్ని కౌన్సిల్ ఆమోదించాల్సి ఉంది. కానీ ఉన్నతాధికారులు ఆదాయం ఒక్కసారిగా భారీగా పడిపోవడంపై అనుమానాలను వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో పాటను రద్దు చేసి మళ్లీ కొత్తపాటను పెట్టాలని అధికారులకు మౌలిక ఆదేశాలు ఇచ్చారు. నిబంధనల ప్రకారం ఈ పాటను కౌన్సిల్ ఆమోదించాల్సి ఉంది. అప్పుడే పాటదారుడికి మార్కెట్‌లో పన్ను వసూలు చేసుకునే అవకాశం కల్పిస్తారు. గత ఏడాదితో పోలిస్తే ఆదాయం ఒక్కసారిగా 180 శాతం పడిపోవడంతో ఉన్న తాధికారులే నిర్ణయం తీసుకున్నారు. ఈ పాత పాటను రద్దు చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించలేదు. ఈ వారంలోనే కొత్త పాటకు నోటిఫికేషన్ జారీ చేస్తామని కమిషనర్ అంజయ్య, ఆర్ఐ నానాజీలు చెప్పారు. ఆ ప్రక్రియ సాగుతుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే మరోసారి పాటను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామన్నారు. ఇదిలా ఉంటే కొత్త ఆర్థిక సంవత్సరంలో వ్యాపారులు, చిరు వర్తకుల నుంచి రోజువారీ పన్నును మునిసిపల్ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది వసూలు చేశారు. మళ్లీ పాట జరిగి ఖరారు అయ్యే వరకు ఇదే పద్ధతి కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.



మంత్రి నిమ్మలను సత్కరిస్తున్న ప్రెస్ క్లబ్



తణుకులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఆరిమిల్లి



సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న రాఘురామకృష్ణరాజు

పెన్షన్ల పెంపు చారిత్రక నిర్ణయం : నిమ్మల

పాలకొల్లు టౌన్ , ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): హామీ మేరకు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పెన్షన్ ఒక్కసారిగా పెంచి ఇవ్వడం సీఎం చంద్రబాబు తీసుకున్న చారిత్రక నిర్ణయమని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణంలోని 31వ వార్డు వడలవాని పేటలో మంగళవారం లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్ళి పెన్షన్ అందజేశారు. పూరిగుడిసెలో ఉంటున్న వృద్ధురాలి ఇంటికి వెళ్ళి పెన్షన్ అందజేశారు. టిడ్కో ఇల్లు మంజూరైనా ఇవ్వలేదని ఆమె తెలపగా గత 5 ఏళ్ళలో జగన్ ఒక ఇంటిని కూడా ఇవ్వలేదని, త్వరలో అందజేస్తామని మంత్రి నిమ్మల హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వృద్ధురాలికి పండ్లు అందించి, పాదాభి వందనం చేశారు. మంత్రి మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులకు 3 నుంచి 4వేలకు, దివ్యాంగులకు 3 వేలు నుండి 6వేలకు, మంచం మీదే ఉన్నవారికి రూ. 5వేలు నుంచి 15 వేలకు ఒక్కసారిగా పెంచి పెన్షన్ అందిస్తున్నామన్నారు. అదే జగన్‌కు వెయ్యి రూపాయలు పెంచడానికి 5 ఏళ్ల పట్టిందన్నారు. ఈ తేడాను ప్రజలు గుర్తించాలని కోరారు.

ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి సహకరిస్తా..

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ప్రెస్ క్లబ్ భవన విస్తరణ పనులకు ఎంపీ నిధుల నుంచి రూ. 10 లక్షలు మంజూరుకు కృషి చేస్తానని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రెస్ క్లబ్ భవనం అదనపు గదుల నిర్మాణపనులను మంగళవారం మంత్రి నిమ్మల పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి నిమ్మలను ప్రెస్‌క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సంద ర్భంగా సీనియర్ పాత్రికేయుడు గుమ్ములూరి భాస్కర రావు రూ10.116లు ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి చెక్కును మంత్రి చేతుల మీదుగా అందజేసారు. ప్రెసిడెంట్ విన్నకోట వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శంగా పెన్షన్ల పంపిణీ : ఆరిమిల్లి

తణుకు/అత్తిలి/ఇరగవరం: కూటమి ప్రభుత్వంలో పారదర్శకంగా పెన్షన్లు పంపిణీ జరుగుతోందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని 15వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం హామీలను అమలు చేస్తుందని వివరించారు. అలాగే అత్తిలి, ఇరగవరం మండలంలోను పెన్షన్లు పంపిణీ చేశారు.

మాట ప్రకారం పెన్షన్ ఇస్తున్నాం: అంజిబాబు

వీరవాసరం/భీమవరంటౌన్: పేదలకు ఇచ్చిన మాట ప్రకారం పించన్ సొమ్ము ఒకేసారి పెంచి అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. కొణితివాడలో లబ్ధిదారులకు మంగళవారం ఆయన మాజీ ఎంపీ సీతారామలక్ష్మితో కలసి పించను అందించారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: రఘురామ

పాలకోడేరు: ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు మండలంలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. విస్సాకోడేరులో అనాథ శిశువుల సంరక్షణ కోసం శిశు గృహాన్ని ప్రారంభించిన అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పలువురు వృద్ధులకు పెన్షన్లు అందజేశారు. కొత్తపాలెంలో సీసీ రోడ్లు, బీసీ కమిటీ హాల్‌ను ప్రారంభించారు. గొరగనమూడి కొత్తపేటలో సీసీ రోడ్ ప్రారంభించారు. తన నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నిలుపుతానని అన్నారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కాళ్ళ: నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రఘురామకృష్ణరాజు అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో ఉపాధి నిధులు రూ. 68.75 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు.

ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

పోడూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాల అభివృద్ధికి దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆచంట ఎమ్మెల్యే, శాసనసభా హక్కుల కమిటీ చైర్మన్ పితాని సత్యనారాయణ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కొమ్ముచిక్కాల క్యాంపు కార్యాలయంలో ఆయన సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ దాతల సహకారంతో పురాతన ఆలయాలను ఆధునీకరించాలన్నారు. రానున్న పుష్కరాల్లో వశిష్ఠ గోదావరికి 5 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఆలయాలు సుందరీకరించాలన్నారు. ఆచంట ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి, కోడేరు శివాలయం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధ చేయాలన్నారు. పుష్కర రేవులను ఆధునీకరించాలని ఇప్పటికే పలు సూచనలు చేశామని ఈ మేరకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. నత్తారామేశ్వరంలో కోనేరులోకి గోస్తనీ నది నుండి మురుగునీరు రాకుండా వాల్వ్ నిర్మాణం చేపట్టాలని కోరారు. కొటాలపర్రులోని ఆలయ అభివృద్ధి చేపట్టాలని కోరారు. భీమలాపురం, కరుగోరుమిల్లి పెదమల్లం మాచేనమ్మ ఆలయం వద్ద రేవులు నిర్మాణం చేపట్టాలని సూచించారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పితాని



పదవీ విరమణ పొందిన వారికి ఎస్పీ సత్కారం

రిటైర్మెంట్ జీవితం ఆనందంగా గడపాలి: ఎస్పీ

భీమవరం క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సత్కరించి వీడ్కోలు పలికారు. పి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ -1305, డీసీఆర్‌బీ, ఏ.వెంకటేశ్వరరావు ఏఎస్‌ఐ -1439, నర్సాపురం టౌన్ పోలీస్ స్టేషన్, కెవీఎస్‌యు భాస్కర రావు, ఏఎస్‌ఐ -149, యలమంచిలి పోలీస్ స్టేషన్ పదవీ విరమణ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో, ఆనంద ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని, పోలీసు శాఖ ఎల్లవేళలా వారికి తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, ఆర్మ్‌డు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట్రావు, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్.మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి

తణుకు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను అందించాలని వేల్పూరు భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం వేల్పూరులో యూనియన్ అధ్యక్షుడు యర్రా మల్లికార్జున రావు అధ్యక్షతన జరిగిన నిర్మాణ కార్మికుల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: కార్మిక సంక్షేమ మండలి పథకాలను పునరుద్ధరించాలని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి దుర్గాప్రసాద్ (ఐఎఫ్‌టియు అనుబంధం) ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక వీవర్స్ కాలనీలోని సమతా మహిళా మండలి భవనంలో జిల్లా ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దుర్గాప్రసాద్ ముఖ్య అతిధిగా మాట్లాడారు.

కార్పెంటర్ల నూతన కార్యవర్గం

తణుకు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తణుకు పట్టణ కార్పెంటర్ల నూతన కార్యవర్గం ఎన్నికైంది. మంగళవారం సంఘ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం గౌరవాధ్యక్షుడు వల్లూరి రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. అధ్యక్షుడిగా చిక్కాల సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మాగంటి అచ్యుతం, కోశాధికారిగా గన్నవరపు సత్యనారాయణతో పాటు పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గంను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు బసవా రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు కలగర వెంకట కృష్ణ తదితరులు అభినందించారు.



మావుళ్ళమ్మను దర్శించుకున్న స్పెషలాఫీసర్ సూర్యకుమారి, కలెక్టర్ నాగరాణి

మావుళ్ళమ్మకు స్పెషలాఫీసర్ పూజలు

భీమవరంటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మావుళ్ళమ్మను జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అర్చకుడుమద్దిరాల శ్రీనివాసరావు వారి కుటుంబ సభ్యుల పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆశీర్వచనాలు అందించి దేవస్థానం తరుపున శేష వస్త్రాన్ని, ప్రసాదాన్ని అందించారు. ఆలయ ఇవో నగేష్ పర్యవేక్షించారు. వారి వెంటన జిల్లా ఉన్నతాధికారులు ఉన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ చేసిన వైద్యాధికారి

ఉండి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మంగళవారం ఉండి పీహెచ్‌సీని జిల్లా వైద్య అధికారి డాక్టర్ గీతాబాయి పరిశీలించారు. కేంద్రంలోని మందుల స్టోర్ రూం, రికార్డులను ఆమె పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమయానికి ఆసుపత్రికి విచ్చేసి రోగులకు అందుబాటులో వుండాలని సూచించారు. వైద్యాధికారులు డా.సాయిచంద్ర, డా.సునంద పాల్గొన్నారు.

హైస్కూల్ పాత భవనానికీ నిధులు కేటాయించరూ..

మొగల్తూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మొగల్తూరు ఉన్నత పాఠశాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1కోటి 71 లక్షలు నిధులు విడుదల చేయడం హర్షణీయమని అయితే పాఠశాల పాత క్యాంపస్ భవన అభివృద్ధికి కేటాయించకపోవడంతో పూర్వ విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. పాత స్ట్రక్చర్‌లో ఉన్న భవనంలో చదివిన విద్యార్థులు చాలా మంది అత్యున్నత స్థాయికి చేరారని, పాత భవనంలో గల వేదిక మీదే తొలిసారి చిరంజీవి నాటక ప్రదర్శన చేసిన విషయాన్ని స్వయంగా చిరంజీవి పలుమార్లు తెలిపారని, పాత భవనంను అభివృద్ధి చేసి వినియోగంలోకి తేవాలని కోరారు.



కుంచనపల్లిలో చెరువు అభివృద్ధి పనులు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కుంచనపల్లి తొండమ్మ చెరువు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామంలో రెండెకరాల విస్తీర్ణంలోని చెరువు పూడుకుపోవడంతో రజక సంఘ నాయకులు ఎమ్మెల్యే బొలిశెట్టికి మొరపెట్టుకోగా రూ.2 లక్షల నిధులివ్వడంతో చెరువు పూడిక తీసి గట్టు పటిష్ఠం చేసే పనులు చేపట్టారు.

చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలి

భీమవరం టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : చేనేత వస్త్రాలు మన్నికలో, నాణ్యతలో మేటిగా ఉంటాయని, ఆరోగ్యవంతమైన చేనేత వస్త్రాలను అందరూ ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. మంగళవారం భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటుచేసిన చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చేనేత దారులను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే ఒక చీరను కొనుగోలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మొట్టమొదటిగా పెద్ద ఎత్తున చేనేత వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ప్రజలంతాప్రదర్శన తిలకించి, వస్త్రాలను కొనుగోలు చేసే చేనేత కార్మికులను ప్రోత్సహించాలన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 6వ తేదీ వరకు కొనసాగుతుందని, ఉదయం 10 నుండి రాత్రి 9 వరకు ఎగ్జిబిషన్ తెరిచి ఉంటుందన్నారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ కె.కన్నబాబు, జిల్లా శాఖ అధికారి కె.అప్పారావు పాల్గొన్నారు.



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఇంటర్వ్యూ..

ఎస్సీఐఎంలో ప్రత్యేక సదుపాయాలు

డాక్టర్ పి. అనిల్ కుమార్
ప్రిన్సిపాల్, ఎస్సీఐఎం డిగ్రీ కళాశాల



- **మీ కళాశాలలో కొత్త కోర్సులేమిటి?**
  జవాబు: బీసీఏ, బీఏ (పొలిటికల్ సైన్సు), బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీసీఏ, బీఏ స్పెషల్ సైన్సు, బీఎస్సీ మ్యాథ్స్ పీజీలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్సు.
- **క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతున్నాయా?**
  జవాబు: కళాశాలలో జేకేసీ, స్కిల్ హబ్ ద్వారా ఏడాదికి దాదాపు 20 కంపెనీలు వచ్చి 150 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుంది. ప్రధానంగా సాఫ్ట్‌వేర్, ఫైనాన్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లు వంటి సంస్థలు వస్తాయి.
- **కళాశాల ప్రత్యేకతలేమిటి?**
  జవాబు: ఆన్‌లైన్ కోర్సులు, ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హేకథాన్స్ వంటి కార్యక్రమాలు జరుగుతాయి.
- **రీసెర్చ్ ల్యాబ్ అందుబాటులో ఉందా?**
  జవాబు: డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ న్యూఢిల్లీ వారి ఆర్థిక సాయంతో రసాయన శాస్త్ర విభాగంలో అత్యాధునిక రీసెర్చ్ ల్యాబ్ అందుబాటులో ఉంది. ఇక్కడ ఆర్గానిక్ నానో మెటీరియల్స్‌పై పరిశోధన జరుగుతుంది.

(ఆంధ్రజ్యోతి-తణుకు)

ఆచంట, పెనుగొండ ఏఎంసీ చైర్మన్ల ఖరారు?

ఆచంట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆచంట, పెనుగొండ ఏఎంసీ చైర్మన్ల పేర్లను ఎట్టకేలకు ప్రకటించారు. ఆచంట ఏఎంసీ చైర్మన్‌గా బీసీ మహిళకు కేటాయించడంతో ఈ పదవి టీడీపీ మండల అధ్యక్షుడు అయిన ఆచంటకు చెందిన కేతా మీరయ్య సతీమణి సత్యవతికి లభించింది. అలాగే పెనుగొండ ఏఎంసీ చైర్మన్ పదవి రామన్నపాలెంకు చెందిన బడేటి బ్రహ్మాజీకి అవకాశం కల్పించారు. రెండు చైర్మన్‌పదవులు కూడా టీడీపీ వారికే దక్కాయి. అయితే వైస్ చైర్మన్ పదవులు ఇంకా ప్రకటించాల్సి ఉంది. అయితే ఆచంట వైస్ చైర్మన్ పదవి బీజేపీకి, పెనుగొండ వైస్ చైర్మన్ పదవికి జనసేన పార్టీకి దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. పదవులు దక్కించుకున్న వారు మంగళవారం ఎమ్మెల్యే పితాని నివాసానికి వెళ్ళి కృతజ్ఞతలు తెలిపారు.

మేజిక్ స్టార్ బోస్‌కు రఘురామ అభినందన



భీమవరం అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉగాది వేడుకల్లో సీఎం చంద్రబాబు నుంచి కళారత్న అవార్డును అందుకున్న ప్రఖ్యాత ఇంద్రజాలికుడు, మేజిక్ స్టార్ డాక్టర్ బోస్‌ను డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు మంగళవారం పెద అమిరంలోని కార్యాలయంలో అభినందించారు.



హార్వేకు ఘన నివాళి

భీమవరం టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : శాస్త్రవేత్త విలియం హార్వే జయంతి సందర్భంగా భీమవరం రెడ్ క్రాస్ శాఖ భవనంలో శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ శివరామ బద్రి రాజు, సభ్యుడు గోపిశెట్టి మురళీ కృష్ణారావు మాట్లాడుతూ హార్వే గుండె, మెదడుకి జరిగే రక్త ప్రసరణపై చేసిన పరిశోధనలు ఇప్పటికీ రక్త ప్రసరణ వ్యవస్థకి మూలాలుగా నిలుస్తున్నాయన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రక్తదాతలకి అవశ్య కత నేటి సమాజానికి ఎంతో ముఖ్యమని, ప్రతి శనివారం రక్తదానాన్ని పెంపొందించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనేకసార్లు రక్తదానం చేసిన కొప్పినీడి బాబీని, డీఎన్నార్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులను సత్కరించారు. ఉండపల్లి రమేష్ నాయుడు, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ శీలం మల్లేశ్వరరావు, సిరిగినీడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.